
క్లుప్తంగా

ప్రత్యేక అలంకరణలో భీమేశ్వరస్వామి



సామర్లకోట: పట్టణంలోని పంచారామ క్షేత్రంలో స్వామి, అమ్మవార్లకు ఈఓ బళ్ల నీలకంఠం ఆధ్వర్యంలో అర్చకులు ప్రత్యేక పూజలు నిర్వహించారు. తెల్లవారుజాము నుంచే స్వామి వారిని దర్శించుకునేందుకు అధిక సంఖ్యలో భక్తులు ఆలయానికి వచ్చారు. పండితులు వేమూరి సోమేశ్వరశర్మ, అల్లకి రాజ్‌గోపాల్‌శర్మ, సన్నిధిరాజు వెంకన్న పూజా కార్యక్రమాలు నిర్వహించారు. అనంతరం స్వామి, అమ్మవారికి ప్రత్యేక అలంకరణలు చేశారు.

నిత్యావసర సరకుల అందజేత

కొత్తపల్లి: అమీనాబాదు గ్రామానికి చెందిన మడద కొండమ్మ ఇటీవల మృతి చెందింది. ఆ కుటుంబాన్ని సోమవారం మత్స్యకార నాయకుడు మడదా విగ్నేష్, రాజేశ్వరి దంపతులు పరామర్శించి 25 కేజీల బియ్యం, నిత్యావసర సరుకులు అందజేసారు. ఈ సందర్భంగా రాజేశ్వరి మాట్లాడుతూ ఐదేళ్లుగా గ్రామంలో ఎవరైనా అనారోగ్యంతో ఉన్నా, మృతి చెందినా, ఆర్థికంగా ఇబ్బందులు పడుతున్న కుటుంబాలను పరామర్శించి ఆర్థిక సహాయం అందిస్తున్నట్టు తెలిపారు.

యజమాని నిర్లక్ష్యంతో రైతుకు నష్టం!



వేట్లపాలెంలో ఎండిపోయిన వరి చేను

సామర్లకోట: వరి పొలంలో కలుపు ఎక్కువగా ఉంటే దానిని నివారించడానికి మందులు రావడంతో రైతులు వాటిని పిచికారీ చేస్తున్నారు. వేట్లపాలెం గ్రామానికి చెందిన నాళ్లం శ్రీనివాసు 1.5 ఎకరాలు వరి సాగు చేస్తున్నాడు. పొలంలో ఉన్న కలుపును నివారించేందుకు కలుపు మందు పిచికారీ చేస్తే చేను ఎండిపోయిందని వైఎస్సార్ సీపీ సీనియర్ నాయకుడు మాకిరెడ్డి రాంబాబు ఆవేదన వ్యక్తం చేశారు. గ్రామంలోని పురుగుమందుల షాపునకు వెళ్లి కలుపు మందు కొనుగోలు చేసిన శ్రీనివాసు ఆదివారం పిచికారీ చేయగా.. సోమవారం ఉదయానికి పంట ఎండిపోయిందని రాంబాబు విలేకర్లకు తెలిపారు. కలుపు మందు అడితే గడ్డి మందు ఇవ్వటంతోనే పంట చనిపోయిందని పేర్కొన్నారు. ఇప్పటివరకు రూ.25 వేలు పెట్టుబడి పెట్టామన్నారు. దీనిపై షాపు యజమానిని ప్రశ్నిస్తే సరైన సమాధానం ఇవ్వట్లేదని ఆరోపించారు. మండల వ్యవసాయాధికారి మురళీధర్‌ను వివరణ కొరగా ఇప్పటివరకు ఎలాంటి ఫిర్యాదు తనకు రాలేదన్నారు. పంట నష్టపోయిన రైతు తనకు లిఖితపూర్వకంగా బిల్లుతో ఫిర్యాదు చేస్తే పురుగుల మందు షాపులో తనిఖీలు చేస్తామన్నారు.

మూడు టన్నుల ఎరువుల సీజ్



ఎరువుల దుకాణంలో తనిఖీ చేస్తున్న అధికారులు

పెద్దాపురం: పట్టణంలో ఎరువులు, పురుగు మందుల దుకాణాలపై వ్యవసాయ శాఖ అధికారులు సోమవారం ఆకస్మిక తనిఖీలు చేశారు. పెద్దాపురం వ్యవసాయ శాఖ ఏడీఏ దైవకుమార్, ఏఓ సంజయ్‌కుమార్ ఆధ్వర్యంలో పట్టణంలో తాళ్లూరి సూర్యనారాయణ సన్స్ దుకాణంలో జీరే ఫారం లైసెన్స్ గడువు ముగిసిన నేపథ్యంలో మూడు టన్నుల అమ్మోనియం సల్ఫేట్‌ను అధికారులు సీజ్ చేశారు. అనంతరం ఏడీఏ మాట్లాడుతూ, ఎఫ్‌సీఓ 1995 చట్టానికి విరుద్ధంగా డీలర్స్ ఎరువుల విక్రయం చేస్తే వారిపై కఠిన చర్యలు తీసుకుంటామన్నారు. ప్రతిరోజు స్టాక్ రిజిస్టార్, స్టాక్ బోర్డు షాప్ మూసే ముందు అమ్మకం, కొనుగోలు వివరాలు అప్‌డేట్ చేయాలన్నారు. ప్రతి రైతుకు తప్పనిసరిగా బిల్లు ఇవ్వాలన్నారు. మండలంలో ఎరువులు, పురుగు మందుల దుకాణదారులు ప్రభుత్వం నిర్దేశించిన విధంగా అన్ని ఎరువులను రైతులకు అందుబాటులో ఉంచాలన్నారు. ఈ తనిఖీల్లో సీజ్ చేసిన ఎరువును కేసు నమోదు చేసి జేసీ కోర్టులో ఉంచినట్లు ఆయన తెలిపారు.

13న సామూహిక ప్రతిజ్ఞ చేపట్టాలి

కాకినాడ సిటీ: ఈనెల 1 నుంచి 31వ తేదీ వరకూ నెల రోజులపాటు నిర్వహిస్తున్న నషా ముక్త్ భారత్ అభియాన్ చైతన్య కార్యక్రమాల్లో భాగంగా 13వ తేదీ బుధవారం జిల్లాలోని అన్ని ప్రభుత్వ కార్యాలయాలు, యూనివర్శిటీలు, కళాశాలలు, పాఠశాలల్లో మాదక ద్రవ్యాలకు వ్యతిరేకంగా సామూహిక ప్రతిజ్ఞ చేపట్టాలని కలెక్టర్ షణ్మోహన్ సగిలి కార్యాలయాల అధిపతులు, ప్రిన్సిపాళ్లు, ప్రధానోపాధ్యాయులను కోరారు. అనంతరం నిర్వహించిన కార్యక్రమాలను 5 నుంచి 10 ఫొటోలు చిత్రీకరించి, ఒక షార్ట్ వీడియోను అదే రోజు తప్పనిసరిగా తమకు పంపాలని కోరారు. ఉద్యోగులు, విద్యార్థులు ఎన్ఎంబీఏ వెబ్‌సైట్‌లో మాస్ ఈ-ప్లెడ్జి తప్పక చేపట్టాలని కలెక్టర్ కోరారు.

పిఠాపురంలో కానరాని అభివృద్ధి

- మురికి కూపంగా పట్టణంలోని వీధులు
- పడకేసిన పారిశుధ్యం
- అస్తవ్యస్తంగా డ్రెయినేజీ వ్యవస్థ
- పంట కాలువల్లోకి మురుగు నీరు
- ఏలేరు కాలువ పొంగడంతో చెరువులను తలపిస్తున్న వీధులు



పందుల స్థావరంగా పిఠాపురంలోని ఓ కాలనీ



ఏలేరు కాలువ నీటితో జలమయమైన రజకపేట ఏరియా

పిఠాపురం: ఆధ్యాత్మిక కేంద్రమైన పిఠాపురం చిన్న చినుకు పడితే చిత్తడిగా మారుతోంది. ఏలేరు కాలువ పొంగిన ప్రతిసారి పట్టణంలోని వీధులు చెరువులుగా మారుతున్నాయి. పారిశుద్ధ్యం నిర్వహణకు రూ.కోట్లు ఖర్చు చేస్తున్నట్లు మున్సిపల్ అధికారులు చెబుతున్నా చెత్త తొలగింపు, మురికి నివారణ చర్యలు మాత్రం కానరావడం లేదు. ఇప్పటికే డ్రెయినేజీ వ్యవస్థ అస్తవ్యస్తంగా మారి మురికి నీరు రోడ్లపై ప్రవహిస్తూ నరకయాతన అనుభవిస్తున్నామని ప్రజలు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. చిన్నపాటి వర్షం కురిసినా రోడ్లు జలమయంగా మారి పట్టణం అంతా మురికికూపంగా మారుతోంది. పిఠాపురం అభివృద్ధికి రూ.కోట్లు మంజూరు చేసి పట్టణాన్ని అభివృద్ధి చేస్తున్నట్లు కూటమి నేతలు ప్రకటించుకోవడం తప్ప ప్రజలకు మౌలిక సదుపాయాల కల్పన మాత్రం అందని ద్రాక్షగానే మిగులుతోంది.

అస్తవ్యస్తంగా డ్రెయినేజీ వ్యవస్థ

పిఠాపురానికి అత్యంత ప్రధాన సమస్యగా ఉన్న డ్రెయినేజి వ్యవస్థను మెరుగు పర్చకపోవడంతో చినుకు పడితే చాలు పట్టణం చెరువుగా మారుతోంది. సాధారణ పరిస్థితుల్లో మురికి నీరు వెళ్లే పరిస్థితులు కనిపించడం లేదు. పట్టణంలో డ్రెయినేజీలు పూడుకుపోయి మురుగునీరు పారడం లేదు. అవుట్‌లెట్ సమస్య తీవ్రంగా ఉంది. పంట కాలువలు మురుగు డ్రెయిన్లుగా తయారయ్యాయి. ఎగువ ప్రాంతాల నుంచి వచ్చే మురుగు అవుట్ లెట్లు లేక పలు ప్రాంతాల్లో నిలిచిపోతోంది. డ్రయివర్స్ కాలనీ, సకలయ్య చెరువు, మోహన్‌నగర్, జగ్గయ్య చెరువు ప్రాంతాలు మురుగుతో దుర్గంధం వెదజల్లుతోంది. ఆ ప్రాంతంలో పిల్లలు, పెద్దలు అనారోగ్యాలకు గురవుతున్నారు. కూలీ డబ్బులు ఆస్పత్రి ఖర్చులకు సరిపోతున్నాయని వారు వాపోతున్నారు. మున్సిపాలిటీ లెక్కల ప్రకారం పట్టణంలో 32 మురికివాడలున్నాయి. 172 కిలోమీటర్ల నిడివిలో పక్కా డ్రెయిన్లు, 71 కిలో మీటర్ల పొడవున కచ్చా డ్రెయిన్లు పట్టణంలో ఉన్నట్టు అధికార లెక్కలు చెబుతున్నాయి. వీటికి కనీస మరమ్మతులు కూడా చేయడం లేదు. కచ్చా డ్రెయిన్లు పరిస్థితి దయనీయంగా ఉంది.

చినుకు పడితే చెరువులే

మురుగు కాలువల్లో పూడికను తొలగించకపోవడంతో వర్షం వస్తే రోడ్లు జలమయమవుతున్నాయి. మెయిన్‌రోడ్డులోని చర్చి సెంటర్, అంబేడ్కర్ సెంటర్, సినిమా సెంటర్, పోలీస్‌స్టేషన్ సెంటర్‌లోని కాలువల్లో మురుగు, వర్షపు నీరు చేరి ఉప్పొంగుతూ రోడ్లపైకి చేరుతోంది. శివారు ప్రాంతాల్లో మురుగు కాలువలు లేకపోవడంతో అక్కడి పరిస్థితి దయనీయంగా ఉంది. చిన్న పాటి వర్షానికి సైతం మెయిన్ రోడ్లు చెరువులుగా మారిపోతున్నాయి. ఏలేరు ఆయకట్టులోని శివారు భూములకు సాగు నీరు అందించే ప్రధాన చెరుకుల కాలువ పట్టణం మధ్యలో ఉంది. ఈ కాలువకు కరపవారి కాలువ, ఈదురు చేను కాలువతోపాటు పలు ఉప కాలువలున్నాయి. ప్రస్తుతం ప్రధాన చెరుకుల కాలువతో పాటు, ఉప కాలువ పట్టణంలో మురుగు కాలువలుగా మారాయి. ఈ పంట కాలువల్లో చెత్త పేరుకుపోయింది. డ్రెయిన్లలో పూడికతీత పనులు తూతూ మంత్రంగా చేస్తున్నారు. ఎంపిక చేసిన ప్రాంతాల్లోని కాలువల్లోనే పూడిక పనులు చేస్తున్నారనే ఆరోపణలున్నాయి. తీసిన పూడిక మట్టిని అక్కడే వేస్తూ ఎండిన తరువాత తొలగించడం లేదు. వర్షం వస్తే తిరిగి పూడిక మట్టి కాలువల్లోకి చేరిపోతోంది.

పట్టణానికి ఏలేరు కాలువతో సమస్యలు

పిఠాపురం పట్టణం నడిబొడ్డు నుంచి వెళ్లే ఏలేరు కాలువతో ప్రజలకు పెద్ద సమస్యలు తలెత్తుతున్నాయి. ఏలేరు కాలువకు నీరు వదిలిన ప్రతి సారి కాలువలు సక్రమంగా లేక నీరు పొంగిపార్లి ప్రజలు అష్టకష్టాలు పడుతున్నారు. ముఖ్యంగా మంగయ్యమ్మరావు పేట, రజకపేట తదితర ప్రాంతాలు రెండు రోజులుగా వచ్చి పడుతున్న నీటితో జలమయమై తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నామని స్థానికులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. తమ సమస్యకు పరిష్కారం చూపించాలని ప్రజలు అధికారులకు మొరపెట్టుకుంటున్నారు.



వర్షంతో జగ్గయ్య చెరువు కాలనీలో రోడ్డు దుస్థితి

ఎంపీ, ఎమ్మెల్యే ఏమయ్యారు?



"పిఠాపురం పట్టణాన్ని ఎంతో అభివృద్ధి చేస్తాం అంటే అది నమ్మి ఓట్లేసిన ప్రజలకు సంవత్సరకాలంగా ఇక్కడ నెగ్గిన ఎంపీ, ఎమ్మెల్యేలు కానరావడం లేదు. ఏడాదిగా ఏ ఒక్క అభివృద్ధి పని పట్టణ పరిధిలో చేయలేదు. పిఠాపురంలో పారిశుధ్యం పూర్తిగా పడకేసింది. ట్రాఫిక్ సమస్య గతంలో కంటే దారుణంగా మారింది. పోలీసులు అసలు ట్రాఫిక్‌ను పట్టించుకోవడం లేదు."

– కొండేపూడి శంఖర్రావు, సామాజికవేత్త, పిఠాపురం

దొరబాబును కలిసిన అనిశెట్టి



అనిశెట్టిని సత్కరించిన దవులూరి దొరబాబు

సామర్లకోట: వైఎస్సార్ సీపీ పెద్దాపురం నియోజకవర్గ కో–ఆర్డినేటర్ దవులూరి దొరబాబును గొల్లప్రోలుకు చెందిన వెంకటసుబ్బారావు సోమవారం మర్యాదపూర్వకంగా కలుసుకున్నారు. వైఎస్సార్ సీపీ ఇంటెలెక్చువల్ వింగ్ స్టేట్ వైస్ ప్రెసిడెంట్‌గా ఆయన బాధ్యతలు స్వీకరించారు. దీంతో దొరబాబును మర్యాదపూర్వకంగా కలిశారు. స్థానిక పార్టీ కార్యాలయానికి వచ్చిన అనిశెట్టిని దొరబాబు అభినందించి, ఘనంగా సత్కరించారు.

గ్రీవెన్స్‌కు నాలుగు అర్జీలు



అర్జీ స్వీకరిస్తున్న శ్రీరమణి

పెద్దాపురం: ప్రజా సమస్యల సత్వర పరిష్కారానికై ప్రతి వారం ప్రజా సమస్యల పరిష్కార వేదిక (పీజీఆర్ఎస్) నిర్వహిస్తున్నామని పెద్దాపురం ఆర్డీఓ కె.శ్రీరమణి అన్నారు. ఈ గ్రీవెన్స్‌కు డివిజన్‌లోని ఆయా మండలాల నుంచి నాలుగు అర్జీలు అందినట్లు ఆమె తెలిపారు. అనంతరం ఆర్డీఓ శ్రీరమణి విలేకర్లతో మాట్లాడారు. డివిజన్ స్థాయిలో వచ్చే ప్రతి అర్జీని ఆయా శాఖకు బదిలీ చేసి సమస్యను పరిష్కరించేందుకు చర్యలు తీసుకుంటున్నామన్నారు. ఆయా అర్జీలను సత్వరమే పరిష్కరించాలని సంబంధిత అధికారులకు ఆదేశించినట్లు ఆమె పేర్కొన్నారు. కార్యక్రమంలో కార్యాలయ ఏఓ మాధవరావు, డీటీ భానుకుమార్, సీడీపీఓ ఉష, ఆయా శాఖల అధికారులు పాల్గొన్నారు.

నేతలకు అభినందనలు



వంగా గీతా విశ్వనాథ్, అనిశెట్టి సుబ్బారావును అభినందిస్తున్న నేతలు

పిఠాపురం: వైఎస్సార్ సీపీ రాష్ట్ర మహిళా విభాగం వర్కింగ్ ప్రెసిడెంట్‌గా నియమితులైన పిఠాపురం నియోజకవర్గం ఇన్‌చార్జ్ వంగా గీతా విశ్వనాథ్, రాష్ట్ర మేధావుల సంఘ విభాగ ఉపాధ్యక్షుడిగా నియమితులైన అనిశెట్టి సుబ్బారావును సోమవారం పిఠాపురం పార్టీ కార్యాలయంలో కొత్తపల్లి మండలానికి చెందిన పలువురు నేతలు కలసి అభినందనలు తెలిపారు. మరిన్ని ఉన్నత పదవులు పొంది పార్టీ బలోపేతానికి కృషి చేయాలని నాయకులు కోరారు. వచ్చే ఎన్నికల్లో పార్టీ అఖండ విజయం సాధించడానికి వారి నాయకత్వంలో సమష్టిగా కృషి చేస్తామని వారు ఈ సందర్భంగా అన్నారు. ఈ కార్యక్రమంలో కొత్తపల్లి మండల పార్టీ అధ్యక్షుడు ఆనాల సుదర్శన్ నియోజకవర్గం చేనేత విభాగం అధ్యక్షుడు గోపి హరిబాబు, సాకా చిన్నబ్బాయి, జల్లా సుధీర్ పాల్గొన్నారు.

జాతీయ స్థాయి పోటీలకు విద్యార్థుల ఎంపిక

పెద్దాపురం: హర్యానాలోని కురుక్షేత్రంలో ఈనెల 27 నుంచి 29వ తేదీ వరకు నిర్వహించే జాతీయ స్థాయి కరాటే పోటీలకు పెద్దాపురం యాసలపు సూర్యారావు భవనంలో శిక్షణ పొందుతున్న విద్యార్థులు ఎంపికయ్యారు. స్థానిక వరహాయ్యలపేట యాసలపు సూర్యారావు భవనంలో పెద్దాపురం చిల్డ్రన్ క్లబ్ (పీసీసీ) ఆధ్వర్యంలో యోగా గురువు వద్ద శిక్షణ పొందుతూ తిరుపతిలో జరిగిన 5వ రాష్ట్రస్థాయి పోటీల్లో ప్రతిభ కనబరిచి జాతీయ స్థాయి పోటీలకు అర్హత సాధించారు. రాష్ట్రంలోని ఆయా జిల్లాల నుంచి పాల్గొన్న విద్యార్థులకు పోటీపడి ముగ్గురు విద్యార్థులు అర్హత సాధించారు. 14, 15 ఏళ్ల విభాగంలో కుమతేలో తెప్పల యోగేశ్వర్, బాలికల విభాగంలో సహస్ర, 11, 12 ఏళ్ల విభాగంలో కుమితేలో పాసిల లోకేష్ ఎంపికయ్యారు. ఈ పోటీలకు ఎంపికైన విద్యార్థులు జాతీయ స్థాయి పోటీల్లో పాల్గొంటారు. ప్రతిభ కనబరిచిన విద్యార్థులను పీసీసీ గౌరవాధ్యక్షుడు బుద్దా శ్రీనివాస్, అధ్యక్ష, కార్యదర్శులు కునిరెడ్డి అరుణ తదితరులు అభినందించారు.



జాతీయ స్థాయి పోటీలకు ఎంపికైన పెద్దాపురం విద్యార్థులు

ఆరోగ్య కేంద్రాలు ఆహ్లాదకరంగా ఉండాలి

సామర్లకోట: ఆరోగ్య కేంద్రాలు ఆహ్లాదకరమైన వాతావరణంలో ఉండాలని స్టేషన్ మేనేజర్ రమేష్ అన్నారు. భారత రైల్వే బోర్డు ఆదేశాల మేరకు ఈనెల 1వ తేదీ నుంచి నిర్వహిస్తున్న స్వచ్ఛత పక్షోత్సవాల్లో భాగంగా సోమవారం రైల్వే ఆస్పత్రిలో స్వచ్ఛత కార్యక్రమం నిర్వహించారు. స్టేషన్ పరిధిలో పనిచేస్తున్న కాంట్రాక్ట్ వర్కర్లకు ఆరోగ్య పరీక్షలు నిర్వహించారు. రోగులు ఆస్పత్రి ఆవరణలోకి వచ్చే సమయానికి ఆహ్లాదకరమైన వాతావరణం ఉంటే రోగాలు వేగంగా తగ్గిపోతాయన్నారు. ఆస్పత్రి అంటే రోగులకు నమ్మకం కలిగే విధంగా ఉండాలన్నారు. ఈ మేరకు రైల్వే స్టేషన్ నుంచి ఆస్పత్రి వరకు ర్యాలీ నిర్వహించారు. కార్యక్రమంలో హెల్త్ సూపర్‌వైజర్ కల్యాణ్, ట్రాఫిక్ ఇన్‌స్పెక్టర్ గిరి, హెల్త్ సిబ్బంది పాల్గొన్నారు.



రైల్వే స్టేషన్ ఆవరణలో స్వచ్ఛత అవగాహన ర్యాలీ

కోతకు గురవుతున్న బీచ్ రోడ్డు

కొత్తపల్లి: ఎటువంటి తుపాన్ హెచ్చరికలు లేనప్పటికీ సముద్ర కెరటాలు ఉవ్వెత్తున ఎగసిపడుతున్నాయి. దీంతో ఉప్పాడ– కాకినాడ బీచ్ రోడ్డు కోతకు గురవుతుంది. ఉప్పాడ శివారు ఎస్సీ జీఎల్ సమీపంలో బీచ్ రోడ్డు ఒక వైపు పూర్తిగా కోతకు గురైంది. బీచ్ రోడ్డులో పెద్దపెద్ద గుంతలు పడటంతో ప్రయాణించే వాహనచోదకులు ఇబ్బంది పడుతున్నారు. బీచ్ రోడ్డులో రక్షణ వేసిన బండరాళ్ల గోడ సైతం కెరటాలు ఉధృతికి రోడ్డు మీద పడుతున్నాయి. కెరటాలు రోడ్డు మీదకు ఎగసి పడుతుండటంతో అటుగా వెళ్లేందుకు ప్రయాణికులు భయాందోళనకు గురవుతున్నారు. ఈ రోడ్డులో ప్రయాణం వాహనచోదకులకు దినదినం గండంగా సాగుతోంది. కాకినాడ– ఉప్పాడ బీచ్ రోడ్డు మృత్యు రహదారిగా మారిందని, అధికారులు స్పందించి కోతకు గురైన రోడ్డుకు మరమ్మతులు చేపట్టాని ప్రయాణికులు కోరుతున్నారు.



ప్రమాదకారంగా మారిన బీచ్‌రోడ్డు



బీచ్ రోడ్డులో గోతులు పడిన దృశ్యం

మారుతున్న రూపురేఖలు..!

- వేగంగా ఫ్లైఓవర్ పనులు
- వాహనదారులకు తప్పనున్న అవస్థలు
- మరో రెండు నెలల్లో అందుబాటులోకి నిర్మాణం





అచ్చంపేట జంక్షన్ వద్ద జరుగుతున్న వంతెన నిర్మాణ పనులు

కాకినాడ రూరల్: పట్టణంలో ఉన్న పోర్టులకు మెరుగైన రవాణా సదుపాయం కల్పించేందుకు రహదారి విస్తరణ పనులు చేపడుతున్నారు. అందులో భాగంగా ఏడీబీ రోడ్డులో నిర్మిస్తున్న ఫ్లైఓవర్ వంతెనతో అచ్చంపేట జంక్షన్ రూపురేఖలు మారుతున్నాయి. పిఠాపురం– కాకినాడ మధ్య రాకపోకలు సాగించే వాహనదారులకు అచ్చంపేట జంక్షన్ వద్ద ఫ్లైఓవర్ నిర్మాణ పనులు వేగంగా జరుగుతుండటంతో మరో రెండు నెలల్లో కూడలిలో ట్రాఫిక్ సమస్యలు కొలిక్కి రానున్నాయి. ఆజాదీ కా అమృత్ మహోత్సవ్‌లో భాగంగా గతిశక్తి పథకం కింద కేంద్ర ప్రభుత్వం చొరవతో గత వైఎస్సార్ సీపీ హయాంలో నాలుగు రోడ్ల విస్తరణకు బీజం పడింది. ఏడీబీ రోడ్లు రాక్ సిరామిక్ నుంచి యాంకరేజ్ పోర్టు వరకు రూ.557 కోట్ల నిధులతో రెండు ప్యాకేజీల్లో పనులు 2023లో ప్రారంభమయ్యాయి. రాక్ సిరామిక్ నుంచి అచ్చంపేట జంక్షన్ వద్ద గోకుల్ గార్డెన్ వరకు 12.2 కిలోమీటర్ల మేర రూ.408 కోట్లతో ఒక ప్యాకేజీ, గోకుల్ గార్డెన్ నుంచి లైట్ హౌస్ మీదుగా యాంకరేజ్ పోర్టు వరకు రూ.149 కోట్లతో మరో ప్యాకేజీగా పనులు ప్రారంభించారు.

నిత్యం రద్దీగా ఉండే..

ఏడీబీ రోడ్డులో రాక్ సిరామిక్ నుంచి సామర్లకోటకు బైపాస్ మార్గంగా కెనాల్ రోడ్డు మీదుగా ముత్యాలమ్మ గుడి పక్క నుంచి నాలుగు లైన్ల రోడ్ల నిర్మాణం పనులు వేగంగా జరుగుతున్నాయి. నిత్యం రద్దీగా ఉండే అచ్చంపేట జంక్షన్ కూడలి వద్ద పిఠాపురం– కాకినాడ మార్గంలో రాకపోకలు సాగించే వాహన దారులకు ఇబ్బంది లేకుండా ఫ్లైఓవర్ నిర్మాణం చేపట్టారు. యాంకరేజ్ పోర్టుతో పాటు డీప్ వాటరు పోర్టుకు ఏడీబీ రోడ్డు మీదుగా రాజమహేంద్రవరం వైపు నుంచి వచ్చే వాహనాలు ఫ్లైఓవర్ వంతెనపై నుంచి రాకపోకలు సాగించనున్నాయి. కాకినాడ– పిఠాపురం మార్గంలోని వాహనాలు ఫ్లైఓవర్ కింద నుంచి రాకపోకలు సాగించనున్నాయి. అచ్చంపేట జంక్షన్‌లో కుడా సర్కిల్ వద్ద నాలుగు రోడ్ల నుంచి వచ్చే వాహనాలతో ట్రాఫిక్ సమస్యలు తరచూ తలెత్తడంతో వాహనదారులు ఇబ్బందులు పడేవారు. ట్రాఫిక్ నియంత్రణకు పోలీసులు శ్రమించాల్సి వచ్చేది. వంతెన నిర్మాణంతో కాకినాడ రూరల్, సిటీ ప్రజలతోపాటు, జిల్లాలోని వివిధ ప్రాంతాలకు అచ్చంపేట జంక్షన్ మీదుగా రాకపోకలు సాగించేవారికి అవస్థలు తప్పనున్నాయి.



కాకినాడ- పిఠాపురం మార్గంలోని ఏడీబీ రోడ్డులో నిర్మిస్తున్న ఫ్లైఓవర్

త్వరితగతిన పనులు పూర్తి

"ఏడీబీ రోడ్డులోని రాక్ సిరామిక్ నుంచి అచ్చంపేట జంక్షన్ గోకుల్ గార్డెన్ వరకు నాలుగు లైన్ల రహదారి విస్తరణ పనులు చాలా వరకు పూర్తయ్యాయి. డిసెంబరు నాటికి నాలుగు లైన్ల రోడ్డు పనులు పూర్తవుతాయని అంచనా వేస్తున్నాం. ముఖ్యంగా ఎక్కువగా ట్రాఫిక్ రద్దీ ఉండే అచ్చంపేట జంక్షన్ వద్ద ఫ్లైఓవర్ నిర్మాణ పనులు రాత్రి, పగలు శ్రమించి నిర్మిస్తున్నాం. వర్షాలు అడ్డంకిగా ఉన్నా పనులు ఆపట్లేదు. ప్రస్తుతం వంతెన నిర్మాణం పూర్తయింది. వంతెనపై రోడ్డు, దానికి కనెక్టివిటీ పనులు జరుగుతున్నాయి. రెండు నెలల్లో పనులు పూర్తవుతాయి. కేంద్ర ప్రభుత్వ రంగ సంస్థ రైల్వే వికాస్ నిగామ్ లిమిటెడ్ (ఆర్‌వీఎన్ఎల్) పర్యవేక్షణలో ఈ పనులు చేపడుతున్నాం."

– రామకృష్ణ, సైట్ మేనేజర్, ఆర్‌వీఎన్ఎల్ సంస్థ.

శ్మశాన వాటిక దారి ఆక్రమణ



కొత్తపల్లిలో ప్రభుత్వ స్థలం ఆక్రమించి ఏర్పాటు చేసిన పశువుల షెడ్డు

కొత్తపల్లి: ఆక్రమణదారులు శ్మశాన వాటిక దారిని కూడా వదలకుండా కబ్జా చేసి అక్రమ నిర్మాణాలు చేపడుతున్నారు. చెరువులే కాకుండా శ్మశాన వాటికకు వెళ్లే దారులను కూడా ఆక్రమించి అక్రమ నిర్మాణాలు చేపడుతున్నా అధికారులు పట్టనట్లు వ్యవహరిస్తున్నారని ప్రజలు ఆరోపిస్తున్నారు. స్థానికంగా పెద్ద చెరువును ఆనుకుని ఉన్న బందిలదొడ్డిలో పలు కులాలకు సంబంధించిన శ్మశాన వాటిక ఉంది. ఈ శ్మశాన వాటికకు వెళ్లే మధ్యలో పంట కాలువను ఆనుకుని ఉన్న రహదారిని ఆక్రమించి కొత్తపల్లికి చెందిన ఓ వ్యక్తి సుమారు మూడు సెంట్ల భూమిలో పశువుల షెడ్డు నిర్మించాడు. అంత్యక్రియలు నిర్వహించేందుకు శ్మశాన వాటికకు వెళ్లలేని పరిస్థితి నెలకొందని స్థానికులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. చెరువు గట్టును ఆక్రమించి గడ్డిమేటు వేశాడు. గేదెలను రోడ్డుమీద ఉంచడంతో పొలాలకు వెళ్లే రైతులు తీవ్ర ఇబ్బందులకు గురవుతున్నారు. ఇప్పటికైనా సంబంధిత అధికారులు స్పందించి ఆక్రమణలు తొలగించాలని పలువురు కోరుతున్నారు. దీనిపై ఇన్‌చార్జ్ ఎంపీడీవో హరికృష్ణను వివరణ కోరగా విచారణ చేసి ప్రభుత్వ స్థలాన్ని ఆక్రమించి చేపట్టిన నిర్మాణాలను తొలగించాలని పంచాయతీ కార్యదర్శిని ఆదేశిస్తామన్నారు.